# రాష్ట్రానికి తలమానికంగా

**పోచంపల్లి ఇక్కత్, తాండూరు కందిపప్పు, లక్కగాజులు, హలీం గురించి చెప్పుకొన్నాం. ఇవే కాకుండా... తెలంగాణ నుంచి మరో 14 ఉత్పత్తులు భౌగోళిక గుర్తింపును పొందడం విశేషం.**



- వెండికే వన్నె తెచ్చే కరీంనగర్ ఫిలిగ్రీ (వెండి వస్తువులు)
- అందంలోను, ఆకర్షణలోను గద్వాల సంస్థానపు రాజసానికి దీటుగా నిలిచే గద్వాల చీరలు.



- పానికి చెక్కతో, సహజమైన రంగులతో తయారుచేసే నిర్మల్ బొమ్మలు.
- అడవుల నుంచి సేకరించిన మేలుజాతి టేకుతో రూపొందించే నిర్మల్ ఫర్నిచర్.
- పురాణేతిహాసాలను కండ్లకు కట్టే.. చేర్యాల నకాశి కళ.
- నాలుగు వందల ఏండ్లుగా మన్నికకూ, వైవిధ్యమైన డిజైన్లకు ప్రసిద్ధి చెందిన నారాయణపేట చీరలు.



- రుమాలుకే ప్రత్యేకత తీసుకువచ్చి, విదేశీయులు సైతం మెచ్చుకునే పుట్టపాక తేలియా రుమాలు.
- జీవన సౌందర్యానికి ప్రతీక అయిన గొల్లభామలను చీర మీద నేసే సిద్దిపేట చీరలు.



- మైనపు పోతతో ఏ బొమ్మకా బొమ్మను ప్రత్యేకంగా తీర్చిదిద్దే ఆదిలాబాద్ డోక్రా ఇత్తడి బొమ్మలు.
- మొగల్ రాజుల కాలంలో ఆరంభమై ఇప్పటికీ అదే ప్రత్యేకతను నిలబెట్టుకుంటున్న వరంగల్ డురీలు.
- చెక్క మీద చిత్రించినా, దశాబ్దాల తరబడి చెక్కు చెదరక ఉండే నిర్మల్ చిత్రాలు.





## వివాదాలు కూడా

భౌగోళిక గుర్తింపును అంత తేలికగా నిరూపించలేం. ఎక్కడో ఒకచోట వివాదం తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ దేశాలు లేదా రాష్ట్రాల మధ్య చిచ్చు రాజేసిన సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకు బాస్మతి బియ్యం మీద GI గుర్తింపు కోసం ఇండియా, పాకిస్థాన్ మధ్య చాలారోజులు పంచాయితీ నడిచింది. ఒకసారి భౌగోళిక గుర్తింపు స్థిరపడిన తర్వాత కూడా... ఎవరికి ఎలాంటి చట్టపరమైన హక్కులు ఉంటాయనే విషయం మీద కూడా కొంత అయోమయం ఉంది. ఈ కారణంగానూ ఎన్నో కేసులు నడిచాయి. ఉదాహరణకు డార్జిలింగ్ టీకి సంబంధించి అక్కడి టీ బోర్డు, ఐటీసీ కంపెనీలు కోర్టుకెక్కాయి. తిరుపతి లడ్డూకు జీఐ ట్యాగ్ చెల్లదు అంటూ చెన్నై హైకోర్టులో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణకు వచ్చింది. తిరుపతి లడ్డూ భౌగోళిక గుర్తింపు ఇచ్చేంత ప్రత్యేకత లేదన్న వాదనను కోర్టు తిరస్కరించింది.